కొత్తచెరువు రైల్వేజంక్షన్ కానుందా..?



యర్రగుంట్ల-కొత్తచెరువు ట్రాక్ నిర్మాణానికి సర్వే



1) కొత్తచెరువు బోర్డు 2) కొత్తచెరువు-ముదిగుబ్బ రైల్వేట్రాక్ కోసం సర్వే చేస్తున్న రైల్వే ఇంజనీరు

పూర్తయితే తగ్గనున్న 100 కి.మీ. దూరం
కొత్తచెరువు ప్రజల్లో ఆనందం
ఉపాధి, ఉద్యోగావకాశాలపై ఆశలు
భూముల ధరలు పెరుగుతాయని అంచనాలు

కొత్తచెరువు, మే22: కొత్త జిల్లాలో మరో రైల్వే జంక్షన్ ఏర్పడనుందా? అదీ డబుల్ ట్రాక్ వేయనున్నారా? అంటే అవుననే అంటున్నాయి రైల్వే వర్గాలు. కొత్తచెరువు నుంచి ముదిగుబ్బ, కడప జిల్లాలోని పులివెందుల మీదుగా యర్రగుంట్ల వరకు డబుల్ ట్రాక్ నిర్మాణానికి రైల్వే శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ధర్మవరం-పుట్టపర్తి ట్రాక్‌తో అనుసంధానించనున్నారు. ఆ దిశగా ఇప్పటికే సర్వే కూడా కొనసాగుతోంది. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే కొత్తచెరువు రైల్వే జంక్షన్ అవుతుంది. అదే జరిగితే కొత్తచెరువు మరింత అభివృద్ధి చెందుతుందనీ, కొత్త జిల్లా కేంద్రమైన పుట్టపర్తి వాసులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్న చర్చ సాగుతోంది. జంక్షన్ ఏర్పడితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కొత్తచెరువు వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూముల ధరలకు రెక్కలొస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ ట్రాక్ ఏర్పాటైతే రైల్వే శాఖకు రూ.కోట్లలో ఆదాకానుంది. 100 కి.మీ. ప్రయాణ దూరం తగ్గుతుందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

మొదలైన సర్వే...

కొత్తచెరువు-యర్రగుంట్ల డబుల్ ట్రాక్ నిర్మాణానికి రైల్వే శాఖ సర్వే చేపడుతున్నట్లు తెలుస్తోంది. కొత్తచెరువు పరిసర ప్రాంతాల్లో రైల్వే ఇంజనీర్లు సర్వే చేస్తున్నారు. ఈ ట్రాక్ ఎటు నుంచి వెళ్తుందని స్థానికంగా చర్చలు సాగుతున్నాయి. ఈ ట్రాక్ సౌత్ వెస్ట్రన్ రైల్వే పరిధిలోకి రానుంది. ఇందుకు సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం బెంగళూరులో ఉంది. అక్కడి నుంచే సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

తగ్గనున్న దూరం



కడప జిల్లాలోని యర్రగుంట్ల ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీలున్నాయి. అక్కడి నుంచి సిమెంటుతోపాటు ఇతర ఖనిజాలను తాడిపత్రి మీదుగా రవాణా చేస్తున్నారు. బెంగళూరు తదితర ప్రాంతాలకు కూడా ఈ మార్గం గుండానే పంపుతున్నారు. యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, అనంతపురం మీదుగా తరలించాలి. ఇది చాలా దూరం అవుతుంది. నిత్యం సిమెంటు ఇతర ఖనిజాల తరలింపునకు రైల్వే శాఖపై అదనపు భారం పడుతోంది. ఈ ఖర్చును తగ్గించుకోవాలని రైల్వే శాఖ భావిస్తోంది. అందులో భాగంగానే యర్రగుంట్ల-కొత్తచెరువు డబుల్ ట్రాక్ నిర్మాణానికి పూనుకుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయితే యర్రగుంట్ల నుంచి పులివెందుల, ముదిగుబ్బ మీదుగా నేరుగా కొత్తచెరువుకు రైళ్లు, గూడ్సులు ప్రయాణించవచ్చు. అపుడు తాడిపత్రి, గుత్తి, అనంతపురం వెళ్లే అవసరం ఉండదు. ఆ దూరం మొత్తం తగ్గనుంది. మొత్తంగా 100 కి.మీ. దూరం వరకు తగ్గుతుందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. తద్వారా రైల్వే శాఖకు చాలా ఆదా అవుతుంది. దీంతో రైల్వే శాఖ, కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. యర్రగుంట్ల-కొత్తచెరువు ట్రాక్ నిర్మాణానికి మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. డబుల్ ట్రాక్ నిర్మాణం ద్వారా రైళ్లు, గూడ్సులకు ఇబ్బంది లేకుండా పోతుందని రైల్వే శాఖ భావిస్తోంది.

అటు ఐపీఎల్.. ఇటు ఎన్నికలు..



పురంలో బెట్టింగ్ జోరు..
ఫలితాలపై భారీగా పందేలు
బాలయ్య మెజార్టీపై కూడా..
అధికార పార్టీకి నై.. నై...

హిందూపురం, మే 22: ఓవైపు ఐపీఎల్ తుది దశకు చేరుకుంది.. మరోవైపు సార్వత్రి ఎన్నికల ఫలితాల రోజు దగ్గరపడుతోంది. దీంతో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఎన్నికలు, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారన్న దానిపై భారీగా పందేలు కాస్తున్నారు. దీంతో పట్టణంలో బెట్టింగ్ ఫీవర్ పట్టుకుంది. ఏ ఇద్దరు కలిసినా పందేలపై మాట్లాడుతున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు తుదిదశకు చేరడంతో పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో బెట్టింగ్ కాసేవారు అధికం అవుతున్నారు. ఎన్నికల విధుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. పోలింగ్ తరువాత రాష్ట్రంలో పలుచోట్ల అధికార పార్టీ అరాచకాల నేపథ్యంలో పోలీసులు శాంతిభద్రతలపై దృష్టి సారించారు. ఇదే అదునుగా భావించిన క్రికెట్ బెట్టింగ్ ముఠాలు రెచ్చిపోతున్నాయి. బంతి బంతికీ పందేలు కాస్తూ రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. ఇప్పటికే ఐపీఎల్ ప్లేఆఫ్ దశకు చేరుకోవడంతో బెట్టింగ్ నిర్వాహకులు మరింత జోరందుకున్నారు. ఐపీఎల్ విజేతగా ఏ జట్టు నిలుస్తుందనే దానిపై పందేలు సాగుతున్నాయి. ఐపీఎల్ సీజన్ బెట్టింగ్ నిర్వాహకులకు కాసులవర్షం కురిపిస్తోంది. యువత అందరి చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో ఆన్‌లైన్ ద్వారా పందేలు కాస్తున్నట్లు సమాచారం. ఎప్పటికప్పుడు బెట్టింగ్ నిర్వాహకులు కొత్త పంథాలను అవలంబిస్తూ పోలీసులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. హిందూపురంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో పెద్దఎత్తున బెట్టింగ్ సాగుతోందని సమాచారం. ఎక్కువగా ఆన్‌లైన్ ద్వారానే యాప్‌లతో చెల్లింపులు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

యువతకు వల



బెట్టింగ్ నిర్వాహకులు.. యువతకు పెద్దమొత్తంలో ఆశ చూపించి పందెం కాసేలా చేస్తున్నారు. ఓడిపోతే వారి వద్ద ఉన్న వాహనాలు, ఇంటి స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నారు. కొంతమంది ఇతర జిల్లాలవారు కూడా ఈ ప్రాంతానికి వచ్చి ముఖ్యులుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. స్థానిక నిర్వాహకులతో కలిసి పందెంలో పాల్గొంటున్నారు. ఇది పోలీసులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు.

రోజుకు రూ.2కోట్లకు పైగానే..



ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా హిందూపురంలో రోజుకు రూ.2కోట్లదాకా బెట్టింగ్ సాగుతున్నట్లు సమాచారం. వాణిజ్యకేంద్రంగా పేరుగాంచిన ముద్దిరెడ్డిపల్లి ఏరియాలో రోజూ రూ.కోటికిపైగా పందేలు సాగగా.. పట్టణంలో పలుచోట్ల బెట్టింగ్ జోరందుకుంది. గాంధీ సర్కిల్ సమీపంలో పోలీసులకు అత్యంత సన్నిహితంగా ఉండే వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి ద్వారా రోజూ రూ.50లక్షలకుపైగా ఆట సాగుతున్నట్లు సమాచారం. పట్టణంలోని రెండు పోలీసు స్టేషన్లలో పనిచేసే సిబ్బంది.. అతడికి సహకరిస్తున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగ్‌లో కొంతమంది పోలీసు సిబ్బంది కూడా ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ కారణంతోనే అతడికి పోలీసులు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో రోజుకు రూ.50లక్షల దాకా పందేలు కాసినట్లు సమాచారం.

ఎన్నికల ఫలితాలపై కూడా..



సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి వచ్చే నెల 4న కౌంటింగ్ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాలపై కూడా బెట్టింగ్ జోరుగా సాగుతోంది. ఎన్నడూలేనివిధంగా ఈసారి పందెంరాయుళ్లు గెలుపోటములతో పాటు ఎమ్మెల్యే బాలకృష్ణ మెజార్టీపై కూడా ఎక్కువగా పందెం కాస్తున్నారు. హిందూపురంలో బాలకృష్ణ మెజార్టీ 20వేలకు తగ్గకుండా వస్తుందని 5 కోట్లకుపైగా పందెం కాసినట్లు సమాచారం. బాలయ్య గెలుపుపై రూ.10కోట్లకుపైగా పందెం కాశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందని నాలుగైదు కోట్లు బెట్టింగ్ వేసినట్లు చర్చ సాగుతోంది. హిందూపురం నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్ ఆరాతీసిన తరువాత బాలయ్య మెజార్టీపై పందెం కాయడానికి ఇతర ప్రాంతాల నుంచి కూడా బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నట్లు తెలుస్తోంది.

అధికార పార్టీకి నై.. నై..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పాటుపై రూ.20కోట్లకుపైగా పందెం కాసినట్లు తెలిసింది. అధికార పార్టీ గెలుస్తుందని బెట్టింగ్ వేసేందుకు హిందూపురం ప్రాంతంలోని వైసీపీ నాయకులు ఎవరూ ముందుకు రాకపోవడం ఆశ్చర్యకరం. పోలింగ్ ముందు వరకు అధికార పార్టీ నాయకులు కొంతమంది మెజార్టీపై పందెం వేస్తామని ప్రగల్భాలు పలికారు. తీరా పోలింగ్ ముగిశాక ఆ పార్టీలోని నాయకులే.. ఓటర్లకు డబ్బు పంచలేదని గొడవపడి కొట్టుకున్నాక ఎవరూ పందెం కాయడానికి ముందుకు రాలేదని అధికార పార్టీ నాయకులు చెప్పుకోవడం గమనార్హం. బాలయ్య భారీ మెజార్టీతో గెలుస్తారని అధికార పార్టీ నాయకులే పందెం కాయడం విశేషం. ఏది ఏమైనా హిందూపురంలో ప్రస్తుతం బెట్టింగ్‌ల జోరు కొనసాగుతోంది.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్థులు



ఇసుక యార్డు వద్ద గ్రామస్థులు



ఇసుక టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

ముదిగుబ్బ, మే 22: మండలంలోని ఉప్పలపాడు ఇసుక రీచ్‌లో నిల్వ చేసిన ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న టిప్పర్లను బుధవారం స్థానికులు అడ్డుకున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లకు ఇసుక లోడ్ చేస్తుండగా ఉప్పలపాడు గ్రామస్థులు అక్కడికి చేరుకుని, అడ్డుకున్నారు. దీంతో వాహనదారులు వెనుదిరిగిపోయారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా, సుప్రీంకోర్టు ఉత్తర్వులను తుంగలో తొక్కి, యథేచ్ఛగా అధికార పార్టీ నాయకుల అండతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో మ్యానువల్ బిల్లులు ఇస్తున్నారని మండిపడ్డారు. ఆ బిల్లులతో రాత్రింబవళ్లు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ రవాణాకు సంబధిత అధికారులు వెంటనే అడ్డుకట్ట వేయాలని కోరారు.

నమో.. నారసింహా..





1) స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, 2) తిరువీధుల్లో విహరిస్తున్న స్వామివారు

వైభవంగా నరసింహస్వామి జయంతి
ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మే 22: నృసింహ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నారసింహ నామస్మరణతో ఆలయం మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఉమ్మడి జిల్లాతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి తలనీలాలు, తులాభారం సమర్పించుకున్నారు.

తిరువీధుల్లో శ్రీవారి విహారం

నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయంలో మూలమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. శేషవాహనంపై ఆశీనులు గావించారు. అనంతరం స్వామివారు తిరువీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

అశ్వవాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు



ధర్మవరం, మే 22: పట్టణంలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 8వ రోజు బుధవారం సాయంత్రం చెన్నకేశవస్వామి అశ్వవాహనంపై ఊరేగారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం హంసవాహనంపై స్వామివారు విహరించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పొరాళ్ల పుల్లయ్య శిష్యబృందం సభ్యులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, డైరెక్టర్లు పొరాళ్ల పద్మావతి, సత్రశాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పుల ఉరికి వేలాడిన నేతన్న



శీలా బాలచౌడయ్య (ఫైల్)

ధర్మవరం, మే 22: మరో నేతన్న అప్పుల ఉరికి వేలాడాడు. స్థానిక శివానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శీలా బాలచౌడయ్య (29) అప్పుల బాధ భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. శివానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ, మహాలక్ష్మి దంపతుల కుమారుడు బాలచౌడయ్య. అదే ప్రాంతానికి చెందిన పద్మావతితో రెండేళ్ల క్రితం ఇతడికి వివాహమైంది. వీరికి సంతానం లేదు. లక్ష్మీనారాయణ ఇదివరకే మరణించాడు. తల్లి మహాలక్ష్మి ఉండగా.. మరో ఇంట్లో బాలచౌడయ్య దంపతులు నివాసం ఉండేవారు. వీరు పక్కనే ఉన్న కేశవనగర్‌లోని మగ్గాల బిల్డింగ్‌లో కూలిమగ్గం నేస్తుండేవారు. బాలచౌడయ్య పెళ్లి, కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధరల్లేక అప్పులు రూ.4లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలోనని తీవ్ర ఆవేదన చెందుతుండేవాడు. ఈ క్రమంలో భార్య మంగళవారం పుట్టింటికి వెళ్లింది. బీటెక్ పూర్తి చేసిన బాలచౌడయ్య తమ్ముడు గిరీశ్ మూడు రోజులుగా అన్న ఇంట్లోనే ఉంటుండేవాడు. అప్పులతో మనస్తాపం చెందిన బాలచౌడయ్య మంగళవారం అర్ధరాత్రి సమయంలో తన గదిలో ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన సోదరుడు వెంటనే కిందికి దించాడు. తల్లి మహాలక్ష్మితో కలిసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. నేతన్న ఆత్మహత్యపై ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నీరు కలుషితం..

కాకి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



30 మంది ఆస్పత్రి పాలు..

రొళ్ల, మే 22: మండలంలోని కాకి గ్రామంలో నీరు కలుషితమై, ఏకంగా 30 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. గ్రామంలో తాగునీటి పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి, వర్షపునీరు చేరి కలుషితమైనట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆ నీరు తాగిన పలువురు గ్రామస్థులకు సోమవారం వాంతులు, విరేచనాలయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఆ సంఖ్య 30 మందికి చేరింది. బాధితులు మదుగిరి, మడకశిర, రొళ్ల ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామంలో పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేసి, చికిత్స అందించారు.

పలుచోట్ల వర్షం

పుట్టపర్తి రూరల్, మే 22: జిల్లాలో పలుచోట్ల మంగళవారం వర్షం కురిసింది. అమడగూరు 20.8 మి.మీ., ఓబుళదేవరచెరువు 16.2 మి.మీ., గోరంట్ల 11.0 మి.మీ., తనకల్లు 6.8 మి.మీ., తలుపుల 6.2 మి.మీ., కొత్తచెరువు 5.0 మి.మీ. వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు ప్రకటనలో తెలిపారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	35.0 25.0	34.0 25.0	36.0 26.0	33.0 24.0	32.0 24.0

ఆరోగ్యశ్రీ సేవల బంద్‌పై మిశ్రమ స్పందన

అనంతపురం టౌన్, మే 22: ఆరోగ్యశ్రీ సేవల బంద్‌పై ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. రూ. వందల కోట్లు ఆరోగ్యశ్రీ చికిత్సలకు అందాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడంలేదని, బకాయిలు చెల్లించే వరకు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని యాజమాన్యాలు నోటీస్ ఇచ్చి ప్రకటించాయి. జిల్లాలోను ఇక్కడ యాజమాన్యాలు రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ చేస్తామని వారి గ్రూప్‌ల్లో మాత్రమే ప్రకటించకున్నాయి. కనీసం మీడియాకు పిలిచి జిల్లాలో కూడా బంద్ చేస్తున్నట్లు ప్రకటించలేదు. కొన్ని ఆస్పత్రుల్లో ఆరా తీస్తే.. పాత కేసులకు మాత్రం చికిత్స అందిస్తున్నామని, కొత్త కేసులను తీసుకోవడంలేదని అన్నారు. మరికొన్ని ఆస్పత్రులను అడిగితే... సీరియస్ కేసులను తీసుకుంటున్నామని, నార్మల్ కేసులను వెనక్కు పంపిస్తున్నామని చెబుతున్నారు. దీనిపై ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ బంద్ చేయలేదని, బుధవారం జిల్లాలో 92 కేసులను అడ్మిన్ చేసుకొని చికిత్సల కోసం ట్రస్ట్ ఆమోదానికి ప్రతిపాదనలు పంపారని అన్నారు. ఎక్కడైనా రోగులను చేర్చుకోలేదని తమ దృష్టికి వస్తే ఆయా ఆస్పత్రులతో మాట్లాడుతామని, వారు ఒప్పుకోకపోతే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆ రోగులను చేర్పించి చికిత్సలు అందిస్తామని అన్నారు.

దేహదానానికి ఎంఎన్‌ఓ అంగీకారం

అనంతపురం టౌన్, మే 22: తాను చనిపోయిన తర్వాత మెడికల్ కళాశాలకు తన దేహాన్ని దానం చేస్తున్నానని ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ ఎంఎన్‌ఓ నాగరాజు అంగీకార వీలునామా పత్రాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌కు బుధవారం అందజేశారు. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు అతన్ని అభినందించారు. దేహదానం చాలా గొప్పదని, వైద్యవిద్యార్థులు వైద్య విద్యను బాగా నేర్చుకోవడానికి, అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఎంఎన్‌ఓ నాగరాజు మాట్లాడుతూ.. తాను ఈ ఆస్పత్రిలోనే 33 ఏళ్ల పాటు పనిచేశానని, తన కుమారుడు కూడా ఇక్కడే వైద్యవిద్యార్థిగా చదువుకున్నాడని, ఈ కళాశాలకు కృతజ్ఞతగా తన దేహాన్ని దానం చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో అనాటమీ విభాగం హెచ్‌ఓడీ ఉమామహేశ్వరరావు, పెథాలజీ హెచ్‌ఓడీ శివశంకరనాయక్, వైద్యులు మధుసూధన్, పరదేశీనాయుడు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు అంగీకారపత్రం అందజేస్తున్న ఎంఎన్‌ఓ

బాబోయ్..! ఇదేం ఆస్పత్రి



బాలింతలు ఉన్న వార్డు

- రేకుల షెడ్డులో బాలింతల కష్టాలు
- నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు
- కంపుకొడుతున్న బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు
- మలమూత్ర విసర్జనకు వెళ్లలేని పరిస్థితి
- ఉక్కపోతతో అల్లాడిపోతున్న నవజాత శిశువులు
- అనంత పెద్దాసుపత్రిలో దారుణ పరిస్థితులు

అనంతపురం టౌన్

పెద్దాస్పత్రిలో బాలింతల కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక వార్డులో సరైన సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ వార్డుకు నీళ్లు రావడం లేదు. దీంతో అక్కడ ఉన్న బాత్రూమ్, మరుగుదొడ్డి కూడా గలీజుతో నిండిపోయాయి. అక్కడకు వెళ్లాలంటేనే కంపు కొడుతోంది. ఈవార్డును రేకులతో ఏర్పాటు చేయడంతో బాలింతలు, నవజాత శిశువులు ఉక్కపోతకు అల్లాడిపోతున్నారు. ఇక కరెంటు పోయిన సమయంలో వారికి ప్రత్యక్ష నరకమే. శిశువులను బతికించుకోవడం కోసం బాలింతల కుటుంబసభ్యులు ఆరు బయట చెట్ల కిందకు తీసుకొచ్చి లాలిస్తున్నారు. అయితే బాలింతలు, ముఖ్యంగా సిజేరియన్ చేయించుకున్న వారు మాత్రం వేడికి అల్లాడిపోతున్నారు.



రేకులషెడ్డులో ఉక్కపోతకు అల్లాడుతున్న బాలింతలు, శిశువులు



వార్డులో ఉక్కపోతకు తట్టుకోలేక పసిబిడ్డలను చెట్లకిందకు తీసుకొచ్చి లాలిస్తున్న మహిళలు

మలమూత్ర విసర్జనకు వెళ్లాలంటే నరకమే



మల, మూత్ర విసర్జనకు వెళ్లేందుకు ఆవార్డులో ఉన్న బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్దామంటే అక్కడ నీళ్లు ఉండవు. ఒక వేళ జగ్గులో నీళ్లు తీసికెళితే అక్కడ మలము, మూత్ర వెళ్లే రంధ్రాలు మూసుకుపోయాయి. ఈక్రమంలో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కష్టాలు అధికారులు, డాక్టర్లకు తెలిసినా కనీసం వారిపట్ల మానవత్వం చూపడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

నీళ్లులేవు, బాత్రూమ్ లేదు



మాది కంబదూరు మండలం. నాకూతురు డెలివరికీ ఇక్కడకు తీసుకొచ్చాం. కాన్పు అయిన తర్వాత ఈరేకుల షెడ్డుకు తీసుకొచ్చి పడేశారు. ఇక్కడ నీళ్ల లేవు, బాత్రూమ్‌లు లేవు. నాలుగురోజులుగా నానాఇబ్బందులు పడుతున్నాం, మాబాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదు.

- చంద్రమ్మ, బాలింత తల్లి

జగ్గులో నీళ్లు తీసుకెళ్తున్నా



నాకు సిజేరియన్ చేశారు. రెండురోజులు కిందట వార్డు నుంచి ఈ రేకుల షెడ్డు విభాగానికి పంపించారు. ఇక్కడ బాత్‌రూమ్‌లు లేవు. నీళ్లు ఉండటంలేదు. దీంతో మూత్రానికి పోయినా జగ్గులో నీళ్లు తీసుకొని పోతున్నా.

- కళావతి, బాలింత, బుక్కరాయసముద్రం

నీళ్లు కొంటున్నాం



ఇదేమి ఆస్పత్రో మాకు అర్థం కావడంలేదు. నీళ్లు లేవు. బాత్రూమ్‌లు లేవు. మూత్రశాలకు వెళదామన్నా దుర్వాసన కొడుతున్నాయి. పైగా అంతా గలీజుగా ఉంది. కాలు పెట్టడానికికూడా మనసు రావడం లేదు. సారోళ్లకు, మేడమ్‌లకు చెబుతున్నా మాగోడు వినేవారేలేరు. నరకం అంటే ఏంటో ఇక్కడ చూస్తున్నాం.

- సావిత్రమ్మ, నార్పల, బాలింత తల్లి

అధికారులు స్పందించాలి..



సార్ ఇక్కడ బాలింతలు అనేక తిప్పలు పడుతున్నారు, నా కూతురుకు సిజేరియన్ చేశారు. రెండురోజుల తర్వాత వార్డు నుంచి నడిపించుకుంటూ ఈరేకుల షెడ్డు వార్డుకు తీసుకొచ్చారు, ఇక్కడకొస్తే నీళ్లలేవు, బాత్రూమ్‌లు లేవు. దూరంగా ఉన్న మరోవార్డుకు వెళుతున్నాం. సిజేరియన్ చేయించుకున్న బాలింతలు అంతదూరం ఎలా పోతారు సార్? కనీసం ఇక్కడ డాక్టర్లు మానవత్వం చూపరు, అధికారులు స్పందించాలి. బాలింతల కష్టాలు తీర్చాలి.

- సిద్దమ్మ, హిందూపురం, బాలింత తల్లి



అనంతపురం: ఎంజీ వెనుకభాగంలో మరమ్మతు పనులు



నగరంలో కూలిన స్తంభాలు, విరిగిన చెట్లు



విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయం

అతలాకుతలం..!

- అరగంట ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభాలు
- ఉమ్మడి జిల్లాలో కరెంటు లేక ఒకటిన్నర రోజు ప్రజల ఇబ్బందులు
- బుధవారమూ కొనసాగిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు.. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు
- ప్రీ మాన్‌సూన్ చెకప్ పట్ల విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

అనంతపురంరూరల్, మే 22: ఈదురు గాలులు.. వర్ష బీభత్సానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగి వందల విద్యుత్ స్తంభాలను నేలమట్టమయ్యాయి. పదుల సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. దీంతో ప్రజలు ఒకటిన్నర రోజు పాటు కరెంటు లేక ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేదు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలకు అనుగుణంగా విద్యుత్ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారే విమర్శలున్నాయి. వాస్తవానికి వర్షం కాలం వస్తోందంటేనే.. ప్రీమాన్ సూన్ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే శాఖలోని అధికారులు వాటికి తిలోదకాలు ఇచ్చారని... ఏమాత్రం వాటి గురించి పట్టించుకోలేదనే వాదనలున్నాయి. ఎంత సేపు సంస్థ ఆదాయం గురించే తప్పా.. ఆ సంస్థ ఆదాయంలో బాగాస్వాములుగా ఉన్న వారికి సేవాలందించే విషయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరాలో నెలకొన్న ఇబ్బందులే ఇందుకు నిదర్శనమంటున్నారు.

రెండురోజులుగా ఇబ్బందులు...

ఈదురుగాలతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాలు, పలు గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంతోపాటు నగర శివారు ప్రాంతాలు, కళ్యాణదుర్గం, గుత్తి ప్రాంతాల్లో కరెంటు సమస్యతో జనాలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు కరెంటు లేని కారణంగా చీకట్లో మగ్గిపోయారు. మరి కొన్ని ప్రాంతాల్లో బుధవారం కూడా ఈ ఇబ్బందులు కొనసాగాయి. ఉక్కపోత.. వేడితో జనం విలవిల్లాడిపోయారు. పిల్లలు, వృద్ధుల ఇబ్బందులు ఇక వర్ణనాతీతం. సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వినియోగదారులు చేస్తున్న ఫోన్లతో విద్యుత్ అధికారులు ఫోన్లు, కార్యాలయాల ఫోన్లు మారుమ్రోగుతున్నాయి. ఫోన్ల తాకిడి.. విద్యుత్ కార్యాలయాల నెంబర్లు నిత్యం బిజీ.. బిజీ అంటూనే వస్తోంది. ఆ రీతిలో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చిన్న.. చిన్న మరమ్మత్తులతో కరెంటు సమస్య తీరేదీ. అయితే వాటి గురించి అటు విద్యుత్ అధికారులు.. ఇటు ఉద్యోగులు ఆరా తీసిన పాపాన పోలేదు. జిల్లా కేంద్రంలో ఈ ఇబ్బందులు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. సమస్యలను సమచార మాధ్యమాలు.. తెలియజేసినప్పటికీ వాటిని పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

ప్రీమాన్‌సూన్ చెకప్ పట్ల నిర్లక్ష్యం ..

సాధారణంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్లను తరచూ పరిశీలించాల్సి ఉంది. తద్వారా సమస్యలున్నా ప్రాంతాల్లో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. అయితే అధికారులు సబ్‌స్టేషన్లను తనిఖీ చేసింది.. మెయిటెనెన్స్ చేయించింది అంతంత మాత్రమే. కేవలం సమస్యలు వచ్చినప్పుడే మాత్రమే ఆయా ప్రాంతాల్లో పనులు చేయించి చేతులు దులుపుకొంటున్నారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను చెట్లు కమ్మేశాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్లకంపలు, ఇతరాత్రవన్నీ పెరిగిపోయాయి. ప్రీమాన్ సూన్‌లో భాగంగా వాటిని చక్కబెట్టే పనులు చేయాల్సి ఉంది. అయితే ఆ పనులను ఏ మాత్రం చేపట్టలేదు. నిత్యం రెవెన్యూ కలెక్షన్లు.. అవీ.. ఇవీ అంటూ సంస్థలోని ఉన్నతాధికారులు చెప్పినవాటిని చేస్తున్నారే తప్పా.. ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. రానున్నది వర్షాకాలం... ఇలాంటి ఈదురుగాలు.. వర్షాలు మరింత ఎక్కువ అయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ సమస్యలు పరిష్కరించేలా అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏదో చేయబోతే.. మరేదో తేలింది

గడ్డ తొలగించే ఆపరేషన్‌ను అర్ధంతరంగా ఆపిన వైద్యులు

ఆందోళన చెందుతున్న బాధితురాలు



నారాయణమ్మ

గుంతకల్లు, మే 22: ఓ మహిళకు ఆపరేషన్ చేస్తూ మధ్యలోనే వదిలేసిన సంఘటన గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నారాయణమ్మ నుదిటిపై గడ్డలా ఓ బుడిపె ఏర్పడింది. ముఖంపై అది వికారంగా కనిపిస్తోందని తొలగించుకోవడానికి ఈ నెల 16న గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్యుడు పరీక్షించి బయట సీటీ స్కానింగ్ చేయించుకుని రమ్మన్నాడు. నారాయణమ్మ అదేరోజున పట్టణంలోని శ్రీ సాయి మిత్ర డయాగ్నస్టిక్ సెంటరుకు వెళ్లి సీటీ స్కానింగ్ చేయించుకుని రిపోర్టు తెచ్చింది. రిపోర్టు, సీటీ స్కానింగ్ ఎక్స్‌రే చిత్రాలను పరిశీలించిన వైద్యుడు నుదిటిపైన గడ్డ ఉంది తొలగించాలి అంటూ మంగళవారం ఆపరేషన్ ప్రారంభించారు. చర్మం ఓపెన్ చేసిన తర్వాత అక్కడ గడ్డ కాకుండా ఎముక పెరిగి ఉందని చెప్పి ఆపరేషన్ చేయడానికి వీలు కాదని కుట్లువేసి మెడికల్ వార్డుకు తరలించారు. విషయం అర్థంకాక పేషెంట్ తరపు బంధువులు వైద్యులను ప్రశ్నించగా, సీటీ స్కాన్ రిపోర్టు ఇచ్చిన డయాగ్నస్టిక్ సెంటరు నిర్వాహకులు తప్పుడు రిపోర్టు ఇచ్చారన్నారు. గడ్డ ఉందని రిపోర్టు ఇవ్వగా, ఆపరేషన్ సమయంలో చర్మం తీసి చూస్తే గడ్డలేదని, ఎముక పెరిగిందన్న విషయం తెలిసిందని చెప్పారు. దీనికి తోడు పేషెంట్ అసలు అడ్మిషన్‌లో లేదని, అడ్మిట్ కాకుండా ఎలా ఆపరేషన్ చేయించుకున్నారని నర్సింగ్ సిబ్బంది సందేహం వ్యక్తం చేయడంతో బాధితురాలు, ఆమె కుటుంబీకులు ఆందోళనకు లోనయ్యారు. సీటీ స్కానింగ్ రిపోర్టును చూసి వైద్యులు సక్రమంగా అంచనా వేయలేకపోవడం ఏమిటని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరింటెండెంటు జయవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా వైద్యులది తప్పులేదన్నారు. డయాగ్నస్టిక్ సెంటరు వారు ఇచ్చిన రిపోర్టులో తప్పు ఉందని, తలపైన గడ్డ ఉందంటూ రిపోర్టు ఇచ్చారని, కానీ ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత లోపల గడ్డ లేని విషయం బయటపడిందని, మెదడుతో సంబంధం ఉన్న ఎముక పెరిగిందని తెలిసి ఆపరేషన్‌ను ఆపినట్లు వివరించారు. ఓపెన్‌చేసిన చర్మానికి కుట్లువేసి పేషెంట్‌ను ఒకరోజు అబ్జర్వేషన్‌లో ఉంచి కర్నూలుకు రెఫర్ చేశారు.

ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

అనంతపురం విద్య, మే 22: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు గురువారం తత్కాల్ ఫీజు చెల్లించడానికి ఆఖరి గడువని ఆర్‌ఐఓ వెంకటరమణ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఫీజుకు అదనంగా తత్కాల్ కింద రూ. 3000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గడువు ఉందన్నారు.

రేపటి నుంచి పరీక్షలు...

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఫస్ట్ ఇయర్ జనరల్ విద్యార్థులు 15,921 మంది, ఒకేషనల్ విద్యార్థులు 980 మంది, సెకెండ్ ఇయర్ జనరల్ విద్యార్థులు 5,017 మంది, ఒకేషనల్ విద్యార్థులు 592 మంది పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా 22,510 మంది విద్యార్థులు రాయనున్నారు. సప్లిమెంటరీ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ఇకపై మాన్యువల్‌గా కాకుండా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది.

బండిశిల తిరునాళ్లకు అనుమతుల నిరాకరణ



రామరాజుపల్లిలో బహిరంగ సభలో ప్రజలతో మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

పామిడి, మే 22: ఈ ఏడాది బండిశిల తిరునాళ్లకు అధికారులు అనుమతులు నిరాకరించారు. మండలంలోని రామరాజుపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామస్థులతో అధికారులు సమావేశమయ్యారు. ముందుగా గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, పామిడి తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సీఐ రాజశేఖర్‌రెడ్డి సుంకులమ్మ, ముత్యాలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండిశిల రథాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. ప్రస్తుత శాంతిభద్రతలపై ప్రజలకు వివరించారు. ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా వస్తున్న తిరునాళ్లను తప్పక జరిపించాలని ప్రజలు కోరారు. ఓట్ల లెక్కింపు తర్వాత జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రజలకు తెలియజేసి వెనుదిరిగారు. పామిడిలోని తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి ఆయా గ్రామాల పెద్దలతో అధికారులు తిరిగి చర్చలు జరిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని వివరించారు. ఇలాంటి తరుణంలో తిరునాళ్లకు అనుమతులు ఇవ్వడం కుదరదని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి సున్నితంగా పెద్దలకు వివరించారు. దీంతో చేసేదేమీలేక ఆయా గ్రామాల పెద్దలు నిరాశతో వెనుదిరిగారు.

చీనీకాయలు టన్ను రూ.39 వేలు

అనంతపురం రూరల్, మే 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.39 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 754 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

ఉన్నప్పుడు వదిలేసి..

ఎన్నికల గొడవలపై పోలీసుల తీరిది

అజ్ఞాతంలో వెళ్లాక వెతుకులాట..!



టీడీపీ నాయకుడిపై చేయి చేసుకుంటున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి (ఫైల్)



టీడీపీ నాయకుడిపైకి దూసుకుపోతున్న వైసీపీ నాయకులు

హిందూపురం, మే 22: చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి పోలింగ్ రోజున వీరంగం సృష్టించాడు. వేరే పంచాయతీకి చెందిన తన అనుచరులను వెంటేసుకుని కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. వీరాపురం పంచాయతీ పరిధిలోని హుస్సేన్‌పురంలో టీడీపీ నాయకుడు బాబురెడ్డిపై దాడికి పాల్పడ్డారు. బాబురెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు. కనిశెట్టిపల్లి, కొత్తచామలపల్లిలో కూడా గొడవలు సృష్టించారు. కానీ అధికార పార్టీ అభ్యర్థి, మరో ముఖ్యనేత అండ ఉండలంతో పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేయకుండా వదిలేశారు. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల హింసపై సీఈసీ సీరియస్ కావడంతో పోలీసులు మేల్కొన్నారు. పురుషోత్తం రెడ్డిని అరెస్టు చేసేందుకు వారం రోజులుగా నాలుగు బృందాలతో గాలిస్తున్నారు.

ఇరువర్గాలపై కేసులు

బాబురెడ్డిపై జరిగిన దాడి కేసులో ఎంపీపీతోపాటు వైసీపీకి చెందిన మరో 18 మందిపై కేసు నమోదు చేశారు. టీడీపీలో బాబురెడ్డితోపాటు మరో 18 మందిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు సీఐ, ముగ్గురు ఎస్‌ఐలు.. తమ సిబ్బందితో నాలుగు బృందాలుగా ఏర్పడి వారం రోజులుగా కర్ణాటకలో గాలిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఇరుపార్టీలకు చెందిన 14 మందిని మాత్రమే ఇప్పటి వరకు అరెస్టు చేశారు. పోలింగ్ రోజు వీరంగం సృష్టించిన ఎంపీపీని పోలీసులే రక్షిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆయన స్థానికంగా అందుబాటులో ఉన్నప్పుడు అరెస్టు చేయకుండా.. అజ్ఞాతంలోకి వెళ్లి.. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాక గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన కదలికలపై పోలీసుల్లో కొందరికి సమాచారం ఉందని, అయినా పట్టుకోవడం లేదని అంటున్నారు. ఎంపీపీ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. పోలింగ్ రోజున జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరుపార్టీలకు చెందిన 38 మందిపై కేసులు నమోదు చేశామని డీఎస్పీ కంజక్షన్ అన్నారు. ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేశామని, మిగిలిన వారిని ఒకటి రెండు రోజుల్లో పట్టుకుంటామని అన్నారు. ఈ కేసులను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారని, ఏ ఒక్కరినీ వదిలేది లేదని అన్నారు. ఈ కేసుల్లో వైసీపీ వర్గీయుల్లో పురుషోత్తంరెడ్డి, టీడీపీ వర్గీయుల్లో బాబురెడ్డి ఏ-1 నిందితులుగా ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్‌కు గాయాలు

ముదిగుబ్బ, మే 22: మండలంలోని ఎం.కొట్టాల సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు దూసుకెళ్లడంతో నలుగురు గాయపడినట్లు పట్నం ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ ఫణీంద్ర మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి కళ్యాణదుర్గానికి తిరిగి వెళుతుండగా ముదిగుబ్బ మండలం ఎం.కొట్టాల సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఫణీంద్ర తీవ్రంగా, ఎర్రిస్వామి, ప్రేమ్‌కుమార్, దినేష్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఫణీంద్రను బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ



వేరుశనగ కాయల నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ సుబ్బారావు

కదిరిఅర్బన్, మే 22: మండలంలో 29వ తేదీ నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు జేడీఏ సుబ్బారావు తెలిపారు. బుధవారం కుమ్మరవాండ్లపల్లిలోని విత్తనకాయల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర ఎకరం ఉన్న రైతుకు 30 కేజీల బస్తా, ఎకరంలోపు ఉన్నవారికి రెండుబస్తాలు, ఎకరాకు పైగా ఉన్నవారికి మూడు బస్తాలు అందిస్తామన్నారు. కే-6, టీసీజీఎస్ - 1694రకం 30కేజీలబస్తా సబ్సిడీ పోను రూ.1,710, కదిరి లేపాక్షి (కె-1812) రకం బస్తా రూ.1,566 చెల్లించాలన్నారు. మొదట రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అందచేస్తామన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, సెల్ వెంట తీసుకుని రావాలన్నారు. ఆయనతోపాటు ఏఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ శ్రీహరినాయక్

తనకల్లు, మే 22: మండలంలోని బాలసముద్రం రైతు భరోసా కేంద్రంలో బుధవారం వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏఓ శ్రీహరినాయక్ పరిలిశీలించారు. రెండురోజులుగా మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో వేరుశనగ సాగుచేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నట్లు ఏఓ తెలిపారు. ఇప్పటివరకు 585మంది రైతులు విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. విత్తన వేరుశనగ అందరికీ అందేలా చూడలన్నారు. ఆయనతోపాటు వీఏఏ సాయిప్రీతి, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టండి: ఆర్డీఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి రూరల్, మే 22: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ భాగ్యరేఖ పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సబ్‌డివిజన్ పోలీసు అధికారి వాసుదేవన్ అధ్యక్షతన శాంతిభద్రతల సమస్యలపై ఆర్డీఓ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ అనంతరం శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టభద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పెట్రోల్‌బంకుల్లో, కిరాణా అంగళ్లలో బాటిళ్లలో డీజిల్, పెట్రోల్ అమ్మడాన్ని నిరోధించాలన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా పెట్రోల్ డీజిల్, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలన్నారు. పేలుడు పదార్థాలు, టపాసులు, అక్రమ నిల్వలు గుర్తించి సీజ్ చేయాలన్నారు. గత ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన వ్యక్తులను, బైండోవర్ జాబితాను, పరిశీలించి ప్రస్తుత ఎన్నికల్లో వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్షన్ 133(1) సీ కింద రాళ్లు, కర్రలు, రాడ్స్‌వంటి వాటిని నిర్మాణపనులకు మాత్రమే వాడేటట్లు చూడాలన్నారు. వీటన్నింటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈడీటీ నరసింహులు, పుట్టపర్తి, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు తహసీల్దార్లు వేణుగోపాల్, నాగభూషణం, భారతి, కళావతి, డీఏఓ వెంకటస్వామి, ఓడీసీ ఖాజాబీ, అమడగూరు రామనాథరెడ్డి, పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి, రూరల్ సీఐ రాగిరిరామయ్య, కొత్తచెరువు యూపీ సీఐ రాజారమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి కందికుంట పరామర్శ



శంకర్‌నాయుడును పరామర్శిస్తున్న కందికుంట వెంకటప్రసాద్

నల్లచెరువు, మే 22: మండలంలోని పెద్దయల్లంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శంకర్‌నాయుడు కాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ఆయన నివాసానికెళ్లి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు కన్వీనర్ రాజశేఖర్, సర్పంచ్ హర్షవర్ధన్ నాయుడు, మాజీ ఎంపీపీ మాబూసాబ్, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు ఎద్దుల అంజనప్ప, మాజీ సర్పంచ్ వెంకటరమణ, శ్రీరాములు, కిరణ్‌కుమార్ నాయుడు, ప్రసాద్‌నాయుడు, మల్లికార్జున ఉన్నారు.

నల్లమాడ: మండలంలోని చెరువువాండ్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు రమేష్‌రెడ్డి ప్రమాదవశాత్తు జారిపడి గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మండల నాయకులు బుధవారం ఆయన నివాసానికెళ్లి పరామర్శించారు. ప్రమాదం గురించి ఆరాతీశారు. మీకు అన్నివిధాల పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బుట్టి నాగభూషణనాయుడు, పైలే రామచంద్ర, శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, రవికుమార్, అరవిందుబాబు, తిరుపాల్ పాల్గొన్నారు.

విజయోత్సవాలు నిర్వహించరాదు: ఎస్ఐ

నల్లమాడ, మే 22: మండలంలో అన్నిపార్టీల నాయకులు విజయోత్సవాలు, ర్యాలీలు జరపకూడదని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద అన్ని పార్టీల నాయకులతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా బాణసంచా పేల్చకూడదని, విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు చేయకూడదన్నారు. పెట్రోల్ బంకుల యజమానులు బాటిళ్లలో పెట్రోలు పట్టకూడదని హెచ్చరించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి




అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ధర్మవరం, మే 22: పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అనంతరం వివిధ రకాల పూలు, తులసీమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పాటలను, భజనలు భక్తులు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేయించారు.

తాడిమర్రి: మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. నారసింపల్లి, ఏకపాదంపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ఉదయం 6గంటలకే పూజా కార్యక్రమాలు ప్రారంభించి 10గంటలకు కల్యాణోత్సవంతో ముగించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

తప్పిన ముప్పు: నారసింపల్లి గ్రామంలో కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో పెద్ద గుండ్లు మంగళవారం రాత్రి ఉన్నఫలంగా పగిలిపోయి కొండమీద నుంచి కిందకు వచ్చాయి. అయితే ఆలయం భాగంలో ఉన్న వేపచెట్టుకు తగిలి రెండు గుండ్లు నిలిచిపోయాయి. మరొకటి ఇంకాస్త కిందకు వచ్చి ఆగిపోయింది. గుండ్లు కిందకు పొర్లడంతో గ్రామస్థులు భయాందోళనకు లోనయ్యారు. ఘటనా స్థలాన్ని తాడిమర్రి ఎస్ఐ నాగాస్వామి పరిశీలించారు.



అలంకరణలో స్వామి, అమ్మవార్లు

అంగరంగ వైభవంగా దుర్గమ్మ పరుష



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

ధర్మవరం రూరల్, మే 22: పట్టణంలో ప్రసిద్ధిచెందిన దుర్గమ్మ అమ్మవారి పరుష అంగరంగవైభవంగా ప్రారంభమైంది. ప్రతి ఏటా చెన్నకేశవస్వామి రథోత్సవం మరుసటి రోజు నుంచి మూడురోజల పాటు అమ్మవారి పరుష జరుగుతుంది. బుధవారం నిర్వహించిన పరుషకు భక్తులు పోటెత్తారు. పెద్దఎత్తున మహిళలు, యువతులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి కుంకుమ, నిమ్మకాయల ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు ఆలయాలో దీపాలు వెలిగించారు. దుర్గమ్మ తల్లీ కరుణించవమ్మా అంటూ వేడుకున్నారు. గాజులు, బొమ్మల అంగళ్ల భక్తుల కోనుగోళ్లతో కిటకిటలాడాయి. ఆలయ ఈఓ వెంకటేశులు, రామశాస్త్రి, మల్లికార్జున, హరికృష్ణ, క్రిష్ణ పాల్గొన్నారు.



గాజులు కొనుగోలు చేస్తున్న యువతులు, మహిళలు

వైభవంగా గంగమ్మ తిరునాళ్ల



అలంకరణలో గంగమ్మ అమ్మవారు

నంబులపూలకుంట, మే 22: మండకేంద్రంలో మూడు రోజులుగా యల్లమ్మ తిరునాళ జరుగుతోంది. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. తిరునాళ సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేకాలంకరణ చేశారు. బుధవారం సిద్దలు, పుట్టసగ్యాం కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం జ్యోతులు, బోనాలు భక్తులు అమ్మవారికి సమర్పిస్తారన్నారు.

28మందిని బైండోవర్ చేశాం: ఎస్ఐ

అగళి, మే 22 : ఇప్పటి వరకు మండలంలో అన్ని రాజకీయపార్టీలకు చెందిన 28మందిని బైండోవర్ చేసి నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నిమి త్తం బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఆయన బుధవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గొడవ లకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామ న్నారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున కర్ణాటక మద్యం మట్కా జూదం గుట్కా తదితర వాటిపై నిఘా ఉంచామన్నారు. చెక్‌పోస్టులవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఇప్పటికే 28మందిని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

పావగడ, మే 22: పట్టణంలోని మీన నర్సింగ్ హోం, అరవింద్ చిల్డ్రన్ హాస్పిటల్ మధ్యలో తపాల నారాయణ(33) అనే వ్యక్తిని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. బాబయ్యగుడి వీధికి చెందిన నారాయణ కొబ్బరికాయలు వలచి జీవనం సాగించేవాడు. అతడు మంగళవారం సాయంత్రం తన ఇంటికి వెళ్లి తల్లితో, భార్యతో మాట్లాడి తిరిగి పట్టణంలోకి వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారన్నారు. అయితే బుధవారం ఉదయం నారాయణ హత్యకు గురైనట్లు కుటుంబసభ్యులకు తెలిసిన వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించా రు. ఇది ముమ్మాటికి హత్యేనని భార్య లక్ష్మీదేవి, కూతురు అనితలక్ష్మి పోలీసుల కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ మృతదే హాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా హంతకులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మద్యం మత్తులో హత్య చేసి ఉంటారని బాలాజీ హోటల్ దగ్గర ప్రతి రోజూ మద్యం ప్రియులు ఎప్పుడూ గొడవ పడుతుండేవారని ఆసుపత్రికి చెందిన వైద్యులు పోలీసులకు తెలిపారు. దీన్ని వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని వైద్యులు పోలీసులకు తెలిపారు.

కన్నులపండువగా సంఘమేశ్వర స్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

కొత్తచెరువు, మే 22: మండల కేంద్రంలోని సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామివారి కల్యాణాన్ని అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ముందుగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణోత్సవాన్ని అర్చకులు రాజేశ్, సాయి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలు, మంగళవాయుద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు బుక్కపట్నం, పుట్టపర్తి మండలాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. గురువారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజ్, నాగరాజ్, ఫణి తెలిపారు.

పాలబావిని శుభ్రం చేసిన యువత



పాలబావిలో అపరిశుభ్రతను తొలగిస్తున్న యువకులు

కదిరిఅర్బన్, మే 22: మండలంలోని ముత్యాలచెరువు వద్ద ఉన్న పాలబావి చెత్తచెదారంతో నిండిపోయింది. బుధవారం పట్టణానికి చెందిన యువత కుటాల లక్ష్మణ్, నరేష్, నాగేంద్ర, నరసింహులు, వెంకటేష్, కార్తిక్, గణేష్, నవీన్, హరిప్రసాద్ బృందంగా ఏర్పడి బావితోని చెత్తాచెదారాన్ని తొలగించారు. వారు మాట్లాడుతూ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు పాలబావిని కూడా సందర్శిస్తారని తెలిపారు. శ్రీవారి భక్తురాలు సాసవుల చిన్నమ్మ భక్తికి నిదర్శనంగా తవ్వించిన బావి అన్నారు. పాలబావిని పట్టించుకోనేవారు లేకపోవడంతో చెత్తతో నిండిపోయిందన్నారు. పాలబావిని శుభ్రం చేసినయువతను పట్టణ ప్రజలు అభినందించారు.

అడ్మిషన్లు ప్రారంభం

పెనుకొండ టౌన్, మే 22: పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారం భమ య్యాయని హెచ్‌ఎం జ్యోతిలత బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. గత సంవత్సరం నుంచి సీఈసీ, ఎంపీసీ గ్రూపులలో బాలికలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశం కోసం స్థానిక కళాశాలలో సం ప్రదించాలన్నారు. బాలికలకు పూరి భద్రత, ఆధునిక ఐఎఫ్‌టీ ద్వారా బోధన, ఉచిత హాస్టల్ వసతి ఉన్నాయ న్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



కోనాపురం వద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పెనుకొండ రూరల్, మే 22 : మండలంలోని కోనాపురం శివార్లలో ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సురేష్ స్వల్పగాయాలతో బయటప డ్డాడు. రొద్దం మండలం చోళేమర్రి గ్రామానికి చెందిన సురేష్ కోనాపురం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. అతడు బుధవారం పెనుకొండ వైపు నుంచి కోనాపురానికి కారులో వెళ్తుండగా గ్రామ శివారులో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సురేష్ స్వల్పగాయాలతో బయటపడగా స్థానికులు హుటాహుటిన ఆటోలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు: సీఐ

బుక్కపట్నం, మే 22: ఎన్నికల నియామవళిని అత్రికమిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని కొత్తకోట గ్రామంలో పోలీసులతో తనిఖీలు నిర్వహించారు. ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 144 సెక్షన్ అములులో ఉందని, నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రశాంతవాతవరణలో ముగిశాయని, గ్రామాల్లో ప్రజలు అల్లర్లకు దూరంగా ఉండలన్నారు. ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని గొడవల జోలికి వెళ్లకూడదన్నారు. అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ ఎస్ఐలు సురేష్‌బాబు, క్రిష్ణమూర్తి, ఏఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పండి

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని ఎం.చెర్లోపల్లి, చీమలనాగేపల్లి గ్రామాలలో బుధవారం ఎస్ఐ తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, మద్యం అమ్మేవారి ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామస్థులు ఎవైనా సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.



బుక్కపట్నం మండల కొత్తకోటలో గ్రామస్థులకు సూచనలిస్తున్న సీఐ



సుబ్బరావుపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్ర

సమస్యలు సృష్టిస్తే సహించం

ధర్మవరంరూరల్: గ్రామాల్లో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ నరేంద్ర హెచ్చరించారు. బుధవారం మండలంలోని సమస్యాత్మక గ్రామమైన సుబ్బరావుపేట గ్రామంలో కార్డెన్‌సెర్చ్ అపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎవరైనా గొడవలు సృష్టించినా, నేరాలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ప్రజలు ఎవరు గొడవలకు వెళ్లకుండా దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గొడవలు చేసినా, సృష్టించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రశాంత వాతావరణంలో తమ పనులు చేసుకోవాలన్నారు. అనంతరం పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డ క్షేమమే ధ్యేయం: డీఎంహెచ్ఓ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ మంజువాణి

పుట్టపర్తి రూరల్, మే 22: ఆసుపత్రికి వచ్చే ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి గర్భిణులకు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలందించి తల్లీబిడ్డను రక్షించడమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లావైద్యాధికారి డాక్టర్ మంజువాణి సూచించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వైద్యసిబ్బంది ప్రతిఒక్కరూ తల్లీబిడ్డను కాపాడుకోవడానికే పని చేస్తున్నామని గుర్తుంచుకోవాలన్నారు. అంతకుముందు జిల్లాలో జరిగిన మాతాశిశు మరణాలకు సంబంధించి డిస్ట్రిక్ట్ హైలెవల్ సబ్‌కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియాసాల్మన్, పీడియాట్రిషన్ డాక్టర్ జోవెల్ వెస్లీ, గైనకాలజిస్టు డాక్టర్ శ్రీలత, డీపీహెచ్ఓఎన్ఓ వీరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ గాయత్రి, హెచ్ఈ చంద్రానాయక్ ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు పంపిణీ చేయాలి

ఓబుళదేవరచెరువు, మే 22: ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీ కింద ఎరువులు పంపిణీ చేయాలని సీపీఎం మండల నాయకుడు సున్నంపల్లి వెంకటరమణ, సీఐటీయూ శ్రీరాములు డిమాండ్ చేశారు. రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనకాయలు 70శాతంతో అందించాలన్నారు. వేరుశనగతోపాటు ఎరువులు కూడా ఇవ్వాలన్నారు. చిరుధాన్యాలు వందశాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి ప్రదక్షిణ



సత్యసాయి గిరిప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, మే 22: సత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను బుధవారం ఘనంగా నిర్వహించారు రాత్రి సమయంలో ప్రశాంతినిలయం గణేష్ గేట్‌వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి భక్తిగీతాలు ఆలపిస్తూ రథాన్ని లాగుతూ శ్రీగిరి ప్రదక్షిణ నిర్వహించారు. గోకులం, గణేష్ కూడలి, పెట్రోలు బంకు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, సత్యమ్మఆలయం, శివాలయం వీధి గోపురంరోడ్డు మీదుగా తిరిగి గణేష్ గేట్ వద్దకు శ్రీగిరిప్రదక్షిణ చేరుకుంది. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

అధ్వానంగా రాగానిపల్లి తండా రోడ్డు



రాగానిపల్లి వెళ్లే మట్టిరోడ్డు ఇదే...

నల్లమాడ, మే 22: మండలంలోని రాగానిపల్లితండా రోడ్డు అధ్వానంగా, గుంతలమయంగా నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. తండాలో దాదాపు 50కుటుంబాలు నివసిస్తున్నాయి. దశాబ్దాల నుంచి ఈరోడ్డు గుండానే వెళ్లాల్సి వస్తోందని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరు జల్లులు కురిసినా రోడ్డు బురదమయంగా మారుతోందన్నారు. చాలా మంది జారిపడిన సంఘటనలు ఉన్నాయన్నారు. ద్విచక్రవాహనవాహనదారులు, పాదచారులు రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని అంటున్నారు. ఎంతమంది పాలకులు, అధికారులు మారినా తండా రోడ్డు మాత్రం మారలేదని వాపోతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలిస్తారేకానీ, తరువాత కన్నెతి కూడా చూడదంలేదని మండిపడ్డారు. అత్యవసర సమయంలో 108 రావాలంటే ఇబ్బందులు పడాల్సిందే అన్నారు. ఇప్పటికైనా తండా రోడ్డును పరిశీలించి రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని వినియోగించుకోండి

ధర్మవరం, మే 22: పట్టణంలోని స్పందన ఆస్పత్రిలో 26వ తేదీన చిన్నపిల్లల ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి వైద్యులు బషీర్, సోనియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని, చిన్నపిల్లల వైద్యులు మహేంద్ర వైద్యచికిత్సలు నిర్వహిస్తారన్నారు. చిన్నపిల్లలకు వచ్చే జ్వరం, దగ్గు, ఉపిరితిత్తుల సమస్యలు, కడుపునొప్పి, మలేరియా, టైఫాయిడ్ తదితర జబ్బులకు వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కూలీలకు పనికల్పించకపోతే చర్యలు: ఏపీఓ

ఓబుళదేవరచెరువు, మే 22: గ్రామాల్లో ఉపాధి పథకం కింద ప్రతి కూలీకి పని కల్పించాలని, అలాకల్పించకపోతే చర్యలు తప్పవని క్షేత్రసహాయకులను ఏపీఓ సుధాకర్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పనులు కల్పించాలన్నారు. 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతి పంచాయతీలో పండ్ల మొక్కల పెంపకం కింద మొక్కల సాగుకు రైతులనుంచి 30లోపు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు జూన్ 5లోపు పనులు ప్రారంభించాలన్నారు. వీటితోపాటు మూడు సంవత్సరాలు ఉపాధి పథకం కింద అందించే లాభాలను రైతులకు వివరించాలన్నారు. ప్రతి కూలీకి రోజూ రూ.300 ఖాతాలో పడేలా పనులు చేయించాలన్నారు. ఈసీ ఆంజనేయులు, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, హనుమంతరెడ్డి, చంద్రారెడ్డి, రాజేంద్రనాథ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం


స్వామివారి కల్యాణోత్సవ దృశ్యం

మడకశిర టౌన్, మే 22: పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం నుంచి అభిషేకాలు, కలశారాధన, నిత్యహోమం, బలిహరణం, శ్రీవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలాగే గురువారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయ స్వామి రథోత్సవం

హిందూపురం అర్బన్, మే 22: మండల పరిధిలోని సంతేబిదనూరులో అతి పురాతన మహిమాన్విత ఆంజనేయస్వామి వారి బ్రహ్మరథోత్సవాన్ని గురువారం నిర్వహించానున్నారు. గ్రామస్థులే కాకుండా చుటుపక్క ల గ్రామాల ప్రజలతో పాటు పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తారు. స్వామికి ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. టీడీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంతేబిదనూరు గేట్‌లో అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.

పీఎస్ తండాలో మారెమ్మ ఊరేగింపు


మారెమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

గుడిబండ, మే 22 : మండలంలోని పీఎస్ తండా గ్రామంలో బుధవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో మారెమ్మ దేవత ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, మే 22: పట్టణ సబ్‌డివిజన్ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి సెక్షన్, మణేసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మణేసముద్రం, మలుగూరు, గొల్లపల్లి, ఊటకూరు గ్రామాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు. వివరాల కోసం ఫోన్ నంబరు 7382720987ను సంప్రదించాలని తెలిపారు.

అడ్మిషన్లు ప్రారంభం

పెనుకొండ టౌన్, మే 22 : పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని హెచ్‌ఎం జ్యోతిలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నుంచి సీఈసీ, ఎంపీసీ గ్రూపులలో బాలికలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశం కోసం స్థానిక కళాశాలలో సంప్రదించాలన్నారు. బాలికలకు పూరి భద్రత, ఆధునిక ఐఎఫ్‌టీ ద్వారా బోధన, ఉచిత హాస్టల్ వసతి ఉన్నాయన్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం తెలిపారు.

28మందిని బైండోవర్ చేశాం: ఎస్ఐ

అగళి, మే 22 : ఇప్పటి వరకు మండలంలో అన్ని రాజకీయపార్టీలకు చెందిన 28మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నిమిత్తం బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఆయన బుధవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... మండలంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అగళి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున కర్ణాటక మద్యం మట్కా జూదం గుట్కా తదితర వాటిపై నిఘా ఉంచామన్నారు. చెక్‌పోస్టులవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఇప్పటికే 28మందిని తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

అగళికి చేరిన పాఠ్య పుస్తకాలు

అగళి, మే 22 : మండలంలోని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు


కోనాపురం వద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పెనుకొండ రూరల్, మే 22 : మండలంలోని కోనాపురం శివార్లలో ఓ కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సురేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. రొద్దం మండలం చోళేమర్రి గ్రామానికి చెందిన సురేష్ కోనాపురం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. అతడు బుధవారం పెనుకొండ వైపు నుంచి కోనాపురానికి కారులో వెళ్తుండగా గ్రామ శివారులో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ సురేష్ స్వల్పగాయాలతో బయటపడగా స్థానికులు హుటాహుటిన ఆటోలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


పెనుకొండలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి


మడకశిరలోని నరసింహస్వామి


భక్తరహళ్లిలో నరసింహస్వామి కల్యాణోత్సవం జరిపిన దృశ్యం

భక్తిశ్రద్ధలతో నరసింహ జయంతి

పెనుకొండ టౌన్, మే 22 : పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించా రు. ఉదయం అభిషేకాలు, 10గంటలకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. స్వామి ఉత్సవ విగ్ర హాన్ని సాయంత్రం పురవీధుల్లో ఊరేగించారు.

మడకశిర టౌన్: పట్టణంలోని కోట వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న నరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో పురవీధుల్లో ఊరేగించారు.

మడకశిర రూరల్: మండలంలో ప్రసిద్ధి చెందిన భక్తరహళ్లి నరసంహ స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. నరసిం హస్వామి జయంతి సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక ఆలంకరణ చేసి పూజలు నిర్వహిం చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ నరసంహరాజు సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని నింకంపల్లిలో బుధవారం లక్ష్మీ నరసింహ స్వామి జయంత్యుత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు కలశపూజ, హోమాలు, మహిళలచే దీపోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి వారికి విశేషపూ జలు, మంత్రపుష్పం, మహానైవేద్యం మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయం త్రం పురవీధుల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహా లను నృత్యాల నడుమ ఘనంగా ఊరేగించారు..

పావగడ: పట్టణంలోని కనుమలో కొలువుదీరిన కనుమ లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వేలాదిమంది భక్తుల నడుమ వైభవంగా జరిగింది. లక్ష్మీదేవి సమేతుడైన ఉద్భవ నరసింహస్వామికి ఉదయం పంచామృతాభిషేకం, వేదపారాయణ, విష్ణుసహస్ర నామ పారాయణం, నరసింహహోమం నిర్వహించారు. మధ్యాహ్నం మంత్రపుష్పం, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం చేపట్టారు. దేవాదాయశాఖ అధికారి సంతోష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో భజన చేశారు., నరసింహస్వామి కీర్తనలు ఆలపించారు.


పురంలో భక్తి పారవశ్యంతో నృత్యాలు చేస్తున్న భక్తులు


పావగడలో కనుమ నరసింహస్వామి

ఈవీఎంల రక్షణ బాధ్యత పోలీసులదే

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

పెనుకొండ టౌన్, మే 22 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం స్ట్రాంగ్ రూమ్‌లలో భద్ర పరిచిన ఈవీఎంల రక్షణ బాధ్యత పోలీసులదేనని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది కూటమి ప్రభుత్వమేనని, 130సీట్లలో కూటమి అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఓటర్లు ఉప్పెనలా తరలి వచ్చారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో చేసిన దౌర్జన్యాలు, అరాచకాలను ఈ సార్వత్రిక ఎన్నికల్లో కొనసాగించి గెలుపు సొంతం చేసుకోవాలని చూసి వైసీపీ విఫలమైందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన అధికారులు, మీడియా, ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ పాలనలో విసిగిపోయిన మహిళలు, అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు నాయకత్వం ఈ రాష్ట్రానికి అవసరమని భావించి పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారన్నారు. జిల్లాలో ఏడు నియోజక వర్గాలతో పాటు ఎంపీ స్థానం గెలువబోతున్నట్లు తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భయాందోళనతో పనిచేసిన అధికారులు ఇప్పుడు బాధ్యతగా వ్యవహరించారన్నారు. ఎన్నికల ముందు వైనాట్ 175అని చెప్పిన వైసీపీ ఇప్పుడు 75సీట్లు వస్తాయని చెప్పుకోవడానికి కూడా వెనుకాడుతోందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజి నప్ప, నాయకులు మాధవనాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, శ్రీని వాసులు, డీవీ ఆంజనేయులు, నీరు గంటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బిట్ కళాశాల వద్ద టీడీపీ శ్రేణులతో ఆమట్లాడుతున్న సవిత

స్ట్రాంగ్‌రూంలు పరిశీలించిన సవిత

హిందూపురం అర్బన్: స్థానిక బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను బుధవారం టీడీపీ పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పరిశీలించారు. అదే విధంగా నాయకులు, కార్యకర్తలతో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కోసం అందరూ ఎదురు చూస్తున్నారని, తెలుగుదేశం గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సవిత వస్తున్న విషయం తెలుసుకొని కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆమెను పలుకరించారు.

సేద్యం పనుల్లో రైతులు బిజీ బిజీ


యర్రమంచి పొలంలో ట్రాక్టర్లతో దుక్కిళ్లు చేస్తున్న రైతులు

పెనుకొండ రూరల్, మే 22 : ముందస్తు వర్షాలు కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుకోసం రైతులు సేద్యం పనుల్లో బిజీబిజీగా మారారు. మండలంలో రెండు వేల హెక్టార్లకు పైగా సాగు విస్తీర్ణం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. మండలంలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పొలాల్లో ట్రాక్టర్ల సాయంతో దుక్కిళ్లు చేస్తున్నారు. పొలాల్లో, గట్టుపై పెరిగిన పిచ్చిమొక్కలు, రాళ్ల తొలగించడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ యేడాది ముందస్తు వర్షాలు కురవడంతో వేరుశనగ పంట సాగుచేసేందుకు మండలంలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రోడ్డుపైనే నిలిచిన వర్షం నీరు


నారాయణమ్మ కాలనీ వద్ద నిలిచిన వర్షపు నీరు

పెనుకొండ రూరల్, మే 22: నగర పంచాయతీ పరిధిలోని నారాయణమ్మ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెనుకొండ-మడకశిర రహదారి నుంచి నారాయణమ్మకాలనీ, పరిటాల డిగ్రీ కళాశాల, కోనాపురం వెళ్లే రహదారి ఐదేళ్ల నుంచి గోతుల మయంగా మారింది. తేలికపాటి వర్షం వచ్చినా గోతిలో నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు నిర్లక్ష్యం కారణంగా రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఎన్నోమార్లు రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు విన్నవించినా నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండ : గుండుమల

అగళి, మే 22 : కార్యకర్తలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి పేర్కొన్నారు. మండలకేంద్రానికి చెందిన తిరుమలప్ప గారి రాజు గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న గుండుమల, శ్రీనవాసమూర్తి బుధవారం మృతుడి ఇంటికి వెళ్లారు. మృతుడి భార్య కళావతిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ ఎల్లవేళలా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాజు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న గుండుమల తిప్పేస్వామి

ప్రభుత్వ లేఅవుట్‌లో అక్రమ కట్టడాల తొలగింపు


అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం


అధికారులతో వాగ్వాదానికి దిగిన మహిళ

పెనుకొండ టౌన్, మే 22 : పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో అక్రమ కట్టడాలను తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, నగర పాలక మునిసిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పోలీసు బందోబస్తు నడుమ బుధవారం తొలగించారు. రెవెన్యూ సిబ్బంది బుధవారం లే అవుట్‌కు వెళ్లారు. లే అవుట్‌లో ప్రజా అవసరాల కోసం ఉంచిన ఖాళీ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను ఎక్స్‌కవేటర్ సాయంతో కూల్చివేశారు. అయితే 2023ఆగస్టులో అప్పటి తహసీల్దార్ పట్టాలు మంజూరు చేశారని అందుకే తాము నిర్మాణాలు చేపడుతున్నామని బాధితులు పేర్కొన్నారు. పట్టాలిచ్చేది వారే అక్రమ నిర్మాణాలంటూ తొలగించేది వారేనా అంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఈ పట్టాలకు సంబంధించిన రికార్డులు లేవని చెబుతున్నారు. ఏదిఏమైనా జగనన్న లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపులో ఒక్కొక్కరికి రూ.2లక్షల దాకా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. అనంతరం తహసీల్దార్ వాహనాన్ని అడ్డుకున్నారు. ఇదే లేఅవుట్‌లో వందల కొద్ది అనధికార నిర్మాణాలు చేపట్టారని వాటిని కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. విచారించి అన్నింటిని తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


రేణుకా ఎల్లమ్మ మూలవిరాట్

హిందూపురం అర్బన్, మే 22: పట్టణ పరిధిలోని చిన్న మార్కెట్ ప్రాంతంలో నెలకొన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో 23వ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల సందర్భంగా శుక్రవారం వరకు మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో హోమాలు రుద్రాభిషేకం పూర్ణాహుతి, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి జ్యోతుల మోశారు. అదే విధంగా గురువారం ఉదయం9 గంటలకు ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, వివిధ హోమాలు, పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని ఆలయ నిర్వహకులు కోరారు.

ఘనంగా నిడిమామిడమ్మ ఉత్సవాలు


అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, మే 22 : మండలంలో ప్రసిద్ధిచెందిన జమ్మానిపల్లిలో వెలసిన నిడిమామిడమ్మ దేవి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని గ్రామాల్లో పురవీధల గుండా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు.

పలు ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్


చిలమత్తూరులో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హిందూపురం అర్బన్, మే 22: పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హస్నాబాద్‌లో బుధవారం పోలీసులు కారెన్ సర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో, తరువాత ఎటువంటి ఘటన లు చోటు చేసుకోకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సీఐ శ్రీనివా సులు తెలిపారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున పలు ఇళ్లలో సోదాలు చేశారు. అదే విదంగా పర్మిట్‌లు లేని 16 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు. అదే విధంగా రూరల్ పరిధిలోని చౌళూరులో పోలీసులు కా రిడాన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసులు, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హిందూపురం రూరల్ సీఐ ఈరన్న పేర్కొన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో ఎస్ఐ గంగాధర్‌తో కలిసి కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బైండోవర్స్, ట్రబుల్ మ్యాంగర్స్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.వారు సిబ్బందితో కలిసి కార్డన్ సర్చ్ చేపట్టారు. దీనిలో భాగంగా రికార్డులు లేని పలు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బీసీ కాలనీలో చెన్నకేశవ, రంగనాథ్ అనే వ్యక్తుల ఇళ్ల నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదుచేశారు.

పెనుకొండ రూరల్ : ఎన్నికల కోడ్ ఉన్నందున గ్రామాల్లో గొడవలకు పాల్పడితే ఎంతటివారిపై నైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తా మని సీఐ యుగంధర్ మావటూరు గ్రామస్థులను హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో మావటూరులో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ సర్చ్ నిర్వహించారు. అనుమానమున్న ఇళ్ల పరిసరాల్లో పోలీసులు సోదాలు నిర్వ హించారు. గ్రామస్థులతో సమావేశమై ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు గ్రామంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడకూడదని హెచ్చరించారు.గ్రామంలో తనిఖీల్లో భాగంగా రికార్డులులేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాజేష్, వలీబాష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

గోరంట్ల, మే 22: పట్టణంలోని 10, ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన దేవాంగుల విద్యార్థులకు బుధవారం ప్రతిభా సురస్కారాలు అందజేశారు. గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో ఉన్న రామాలయం వద్ద ఉపాధ్యాయులు దేవాంగం జగదీశ్వర్ ఆధ్వర్యంలోప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 13మంది, ఇంటర్‌లో 12మంది విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. వారిని కుటుంబ సభ్యుల సమక్షంలో డిక్షనరీ, పెద్దబాలశిక్ష, భగవద్గీత అందించి, శాలుంతో ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకుడు నాగరాజు అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే జగదీశ్వర్‌ను శాలువ, పూలమాలతో సత్కరించా రు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు అశ్వత్థనారాయణ, వెంకటరమణ, సుబ్బయ్య, కెంపుల నాగభూషణ, కెంపుల చంద్రమోహన్, శ్రీనివాసులు, ఆర్‌డీటీ వెంకటేష్, విద్యార్థులు, తల్లిదండ్రులున్నారు.

వ్యక్తి దారుణ హత్య


తపాల నారాయణ మృతదేహం

పావగడ, మే 22: పట్టణంలోని మీన నర్సింగ్ హోం, అరవింద్ చిల్డ్రన్ హాస్పిటల్ మధ్యలో తపాల నారాయణ(33) అనే వ్యక్తిని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాయితో కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. బాబయ్యగుడి వీధికి చెందిన నారాయణ కొబ్బరికాయలు వలచి జీవనం సాగించేవాడు. అతడు మంగళవారం సాయంత్రం తన ఇంటికి వెళ్లి తల్లితో, భార్యతో మాట్లాడి తిరిగి పట్టణంలోకి వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారన్నారు. అయితే బుధవారం ఉదయం నారాయణ హత్యకు గురైనట్లు కుటుంబసభ్యులకు తెలిసిన వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఇది ముమ్మాటికి హత్యేనని భార్య లక్ష్మీదేవి, కూతురు అనితలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా హంతకులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మద్యం మత్తులో హత్య చేసి ఉంటారని బాలాజీ హోటల్ దగ్గర ప్రతి రోజూ మద్యం ప్రియులు ఎప్పుడూ గొడవపడుతుండేవారని ఆసుపత్రికి చెందిన వైద్యులు పోలీసులకు తెలిపారు. దీన్ని వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని వైద్యులు పోలీసులకు తెలిపారు.